సాక్షి
ఆదిలాబాద్

బుధవారం । 25 । జూన్ । 2025

బ్యాంకులో తుపాకీ మిస్‌ఫైర్

ఆదిలాబాద్‌లోని శివాజీచౌక్‌లో గల ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో తుపాకీ మిస్‌ఫైర్ అయ్యింది. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు.



8లో▸



తీర్థయాత్రలకు ప్రత్యేక రైలు

తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల కోసం జూలై 5 నుంచి 13 వరకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైలు ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్ జీపీ కిశోర్ తెలిపారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా విజయ్‌కుమార్



విజయ్‌కుమార్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా కె.విజయ్‌కుమార్ నియామకమయ్యారు. మంచిర్యాల మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయనకు గ్రేడ్–3 కమిషనర్‌గా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఆదిలాబాద్‌కు బదిలీ చేసింది. ఈమేరకు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ టి.కె శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకంతో కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టు భర్తీ కానుంది.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి 'జూపల్లి'ని కలిసిన బోథ్ ఎమ్మెల్యే



మంత్రి జూపల్లి కృష్ణారావును సన్మానిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన జూపల్లి కృష్ణారావును బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, తిరుమల్ గౌడ్, శ్రీరామ్ నాయక్, పాండురంగ్, అభినవ్ సర్దార్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా సైన్స్ అధికారి పోస్టుకు సైన్స్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. డాక్యుమెంట్, సర్టిఫికెట్లను జత చేసి ఈనెల 30లోగా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొన్న అనుభవం కలిగి ఉండాలని, వివిధ స్థాయిల్లో ప్రాజెక్టులు తయారు చేసినవారు, సెమినార్‌లో పాల్గొన్న వారు, జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

27న సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: డీఎడ్‌లో ప్రవేశం కోసం రెండో విడత సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 27న నిర్వహించనున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్లు సమర్పించాలని పేర్కొన్నారు. మొదటి విడతలో కళాశాలలో చేరిన విద్యార్థులకు స్లైడింగ్, వెబ్ ఆప్షన్లు సమర్పించుకునే అవకాశం ఉందని తెలిపారు. జూలై 1న ఎడిట్ ఆప్షన్ ఉంటుందని పేర్కొన్నారు.

నేడు డీపీఎంల బదిలీ కౌన్సెలింగ్

కైలాస్‌నగర్: జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెర్ప్ పరిధిలో పనిచేసే డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ (డీపీఎం)ల బదిలీ కౌన్సెలింగ్ షెడ్యూల్ ఖరారైంది. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో వారికి కౌన్సెలింగ్ ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

'ఉపాధ్యాయులతో స్కూళ్ల తనిఖీలు మానుకోవాలి'

ఆదిలాబాద్‌టౌన్: ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీలు, పీఎస్ హెచ్‌ఎంలతో, ఉన్నత పాఠశాలల్లో ఎస్‌ఏలతో తనిఖీలు చేపట్టడం మానుకోవాలని టీయూపీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునిల్ చౌహాన్, గోపీకృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీరి స్థానంలో కొత్త ఎంఈవో, మానిటరింగ్ ఆఫీసర్లను నియమించాలని కోరారు. విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి: సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడ్మేత మనోహర్ అన్నారు. మండలంలోని పిట్టబొంగరం ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందిని ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్న క్రమంలో వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట వైద్యుడు ప్రతాప్‌నాయక్, సిబ్బంది తదితరులున్నారు.



సాత్నాల మండలం మాంగుర్ల గ్రామ రెవెన్యూ సదస్సులో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా (ఫైల్)

భూభారతి @12,235

- రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తుల వెల్లువ
- ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది
- మొదలైన క్షేత్రస్థాయి పరిశీలన
- ఆగస్టు 15లోగా పరిష్కారానికి చర్యలు

కైలాస్‌నగర్: పెండింగ్ భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి నూతన రెవెన్యూ చట్టం–2025ను అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా ఈ నెల 3నుంచి 20వరకు ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించింది. ఇందులో వివిధ భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లా వ్యాప్తంగా 12,235 అప్లికేషన్లు అందాయి. ఈ మేరకు వాటి పరిష్కారంపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. ఓ వైపు దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తూనే మరోవైపు క్షేత్రస్థాయి పరిశీలన చేపడుతున్నారు. సమస్యల సత్వరపరిష్కారానికి చొరవచూపుతున్నారు. దీంతో బాధిత రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

బేలలో అత్యధికం..

గత నెలలో పైలట్ ప్రాజెక్ట్ మండలంగా భోరజ్‌ను ఎంపిక చేశారు. అందులో ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించిన సంగతి తెలిసిందే. మిగతా 20 మండలాల్లోని 481 రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 3 నుంచి 20వరకు ఈ ప్రక్రియ పూర్తి చేశారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ల ఆధ్వర్యంలో మండలానికి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అప్లికేషన్లను స్వీకరించారు. బేల మండలంలో అత్యధికంగా 1,507 దరఖాస్తులు రాగా అత్యల్పంగా ఆదిలా బాద్ అర్బన్ మండలంలో 70 వచ్చాయి. సమస్యల వారీగా పరిశీలిస్తే అసైన్డ్ భూములకు సంబంధించినవే ఎక్కువగా అందాయి. భూసర్వే, ఆర్‌వోఎఫ్‌ఆర్ పీవోటీ వంటి వివిధ సమస్యలపై కూడా పెద్ద ఎత్తున దరఖాస్తులు అందాయి.

వివిధ సమస్యలపై అందిన దరఖాస్తుల వివరాలు

భూ సమస్య	అందిన దరఖాస్తులు
సాదాబైనామా	947
అసైన్డ్ ల్యాండ్స్	1,642
ఆర్‌వోఎఫ్‌ఆర్	1,531
భూ సర్వేకోసం	1,209
పేరు,భూవిస్తీర్ణంసవరణ కోసం	1719
సక్సెషన్	1452
భూమి మిస్సింగ్	395
భూమి ఎకరాల కరెక్షన్	427
పీవోటీ	108
డిజిటల్‌సైన్ పెండింగ్	667
అప్పీళ్లకు సంబంధించి	139

ఓ వైపు ఆన్‌లైన్.. మరోవైపు పరిశీలన

రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులన్నింటినీ ఆగస్టు 15లోపు పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఆ దిశగా అధికారులు దృష్టి సారించారు. అప్లికేషన్ల వివరాల నమోదు కోసం ప్రభుత్వం తహసీల్దార్లకు ప్రత్యేక లాగిన్లను కేటాయించింది. దీంతో ఆయా మండలాల్లో అందిన దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆ లాగిన్‌లో ఆన్‌లైన్ చేస్తున్నారు. మరోవైపు నాయబ్ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో సిబ్బంది నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. ప్రతీ దరఖాస్తు పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. హద్దులను పరిశీలించి తప్పిదాలు జరిగితే అక్కడికక్కడే సరిచేస్తున్నారు. పట్టాలు, పహణీల్లోని పేర్లలో తప్పులు ఉంటే వాటిని మారుస్తున్నారు. తహసీల్దార్ స్థాయిలో వీలున్న అన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో పరిష్కారమయ్యేవి ఉంటే వారి లాగిన్లకు పంపుతున్నారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సమగ్ర నివేదిక రూపొందిస్తున్నారు. అధికారులే తమ వద్దకు వస్తుండటంతో పరిష్కారంపై రైతుల్లో భరోసా కనిపిస్తోంది.

మండలం	నిర్వహించిన సదస్సులు	అందిన దరఖాస్తులు
ఆదిలాబాద్‌అర్బన్	03	70
మావల	04	152
గుడిహత్నూర్	21	559
జైనథ్	23	573
సొనాల	10	116
తాంసి	12	393
భీంపూర్	19	1041
సాత్నాల	12	293
నార్నూర్	24	598
ఉట్నూర్	39	400
ఆదిలాబాద్‌రూరల్	35	1394
బజార్‌హత్నూర్	31	706
బేల	42	1507
బోథ్	29	480
తలమడుగు	29	1119
నేరడిగొండ	43	960
ఇచ్చోడ	35	664
సిరికొండ	14	453
ఇంద్రవెల్లి	27	230
గాదిగూడ	30	327

'జూపల్లి' వస్తున్నారు..

- ఇన్‌చార్జి మంత్రిగా నియామకం తర్వాత తొలిసారిగా జిల్లాకు..
- మంత్రి వివేక్‌తో కలిసి రేపు ఆదిలాబాద్ పర్యటన
- రెండు రోజులపాటు జిల్లాలోనే..
- ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో బిజీ షెడ్యూల్



జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

సాక్షి, ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన తర్వాత తొలిసారిగా రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదిలాబాద్‌కు వస్తున్నారు. గురు, శుక్రవారాల్లో ఆయన జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్ర కార్మిక, గనులశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కూడా ఆయనతో కలిసి ఈ పర్యటనకు విచ్చేయనున్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు మంత్రుల పర్యటన అధికారికంగా ఖరారైంది. ఇందులో భాగంగా ఉట్నూర్, తలమడుగు, బేల, నిర్మల్‌లోనూ పర్యటించనున్నారు. పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేపట్టనున్నారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటనున్నారు.

సర్వత్రా ఆసక్తి..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా సీతక్కను నియమించారు. ఇటీవల ముగ్గురు ఎమ్మెల్యేలను మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా కేబినెట్ విస్తరించడం, ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను మార్పు చేసిన విషయం తెలిసిందే. సీతక్కను నిజామాబాద్ జిల్లాకు, ఆ జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న జూపల్లిని ఆదిలాబాద్‌కు మార్చిన విషయం విదితమే. అంతే కాకుండా ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర మంత్రివర్గంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌కు చోటు దక్కింది. ఈ క్రమంలో ఇద్దరు మంత్రులు తొలిసారిగా మంత్రి హోదాలో ఆదిలాబాద్‌కు విచ్చేసి ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పర్యటన ఇలా..

- గురువారం వేకువజామున హైదరాబాద్ నుంచి ఇన్‌చార్జి మంత్రి జూపల్లి రోడ్డు మార్గాన ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి 11 గంటలకు చేరుకోనున్నారు. స్థానికంగా ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో నేరుగా పాల్గొననున్నారు.
- గురువారం ఆదిలాబాద్‌లో రూ.1.40 కోట్లతో నిర్మించిన కామన్ సర్వీస్ సెంటర్, తలమడుగులో రూ.1.56 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించనున్నారు. అలాగే బేల మండలం చప్రాలలో రూ.2.30 కోట్లతో నిర్మిస్తున్న జెడ్పీహెచ్‌ఎస్ బాలుర హాస్టల్ భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. రాత్రి జిల్లా కేంద్రంలోని పెన్‌గంగ విశ్రాంతి భవనంలో బస చేయనున్నారు.
- శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటనున్నారు. మావల అర్బన్ పార్కులో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అక్కడినుంచి ఉట్నూర్‌కు బయల్దేరి వెళ్లనున్నారు. ఉట్నూర్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉన్నతీకరణలో భాగంగా రూ.13.70 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం పీఎంఆర్‌సీ భవనంలో ఆదివాసీ కమ్యూనిటీ పెద్దలతో సమావేశం కానున్నారు. అక్కడి నుంచి నిర్మల్‌కు బయల్దేరి వెళ్లనున్నారు. నిర్మల్‌లో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నారు. స్వయం సహాయక సంఘాలకు చెక్కులు ఇవ్వనున్నారు. ఆ సాయంత్రం నిర్మల్ నుంచి బయల్దేరి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. ఇదిలా ఉంటే మంత్రుల పర్యటనకు సంబంధించి ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా జిల్లాల ఎస్పీలు బందోబస్తు సమీక్షించనున్నారు.

సమయపాలన పాటించాలి



రిజిస్టర్లను పరిశీలిస్తున్న డీఈవో

నార్నూర్: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు, ఉర్దూమీడియం పాఠశాలలు, విజయ్‌నగర్‌లోని ఎంపీపీఎస్‌తో పాటు దివ్యాంగుల కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ విద్యాసంవత్సరం ప్రవేశాలపై ఆరా తీశారు. ఎంపీపీఎస్‌లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ తక్కువగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈవో పవార్ అనిత, సీసీ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

- కలెక్టర్ రాజర్షి షా



సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అలాగే జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా పూర్తిగా అరికట్టాలన్నారు. మిషన్ పరివర్తన్– నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఫ్రీడమ్ పార్కులో అధికారులతో కలిసి మంగళవారం వివిధ రకాల మొక్కలు నాటారు. అయామ్ ఆన్ యాంటీ డ్రగ్ సోల్జర్ సెల్ఫీ స్టాండ్ వద్ద ఫొటో దిగారు. అనంతరం ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలను నియమించాలన్నారు. గంజాయిసాగు, మత్తు పదార్థాల అక్రమ రవాణా జరుగుతున్నట్లు దృష్టికి వస్తే టోల్‌ఫ్రీ14446, 1908 నంబర్లతో పాటు డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్‌కలెక్టర్ యువరాజ్, ట్రెయినీ కలెక్టర్ సలోని, డీఎఫ్‌వో ప్రశాంత్, జిల్లా సంక్షేమాధికారి మిల్కా, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు పాల్గొన్నారు.

మత్తు పదార్థ రహిత సమాజ నిర్మాణానికి బహుముఖ వ్యూహం

మత్తు పదార్థ రహిత సమాజ నిర్మాణం కోసం బహుముఖ వ్యూహంతో ముందుకెళుతున్నట్లు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆకాశవాణితో ముచ్చటించారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు చేపడుతున్న కార్యక్రమలనువివరించారు. అవగాహనతోనే వీటిని రూపు మాపగలుగుతామన్నారు. ఇందులో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, ఆకాశవాణి రిటైర్డ్ డైరెక్టర్ సుమనస్పతిరెడ్డి, ముఖ్య కార్యక్రమాధికారి కె. రామేశ్వర్ పాల్గొన్నారు.

'రైతు భరోసా' సద్వినియోగం చేసుకోవాలి

గుడిహత్నూర్: రైతు భరోసాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని సీతాగోంది రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు భరోసా సంబరాల్లో పాల్గొని మాట్లాడారు. రైతులు సాగులో అధికారుల సూచనలు పాటించి మంచి దిగుబడులు సాధించాలన్నారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి,ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గుణవంత్ చౌహాన్, తహసీల్దార్ కవితా రెడ్డి, మండల ప్రత్యేక అధికారి సునీత, ఏవో రమేశ్ పాల్గొన్నారు.

'ఇందిరమ్మ'లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు..

కైలాస్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో సంబంధిత కమిటీలు, అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, సబ్‌కలెక్టర్ యువరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఆవరణలో సిబ్బందితో కలిసి మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. ప్రజలు గంజాయి, డ్రగ్స్‌పై ఎలాంటి సమాచారమైనా డయల్ 100, పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. ఇందులో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు, డీఎస్పీలు శ్రీనివాస్, ఎల్.జీవన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి యుద్ధం..

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి యుద్ధం చేస్తామని ఎస్పీ అన్నారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయించినట్లు, సేవించినట్లు దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం 'ఐ ఆమ్ ఆన్ యాంటీడ్రగ్ సోల్జర్' అంటూ.. విద్యార్థులతో కలిసి ఫొటోలు దిగారు. అంతకముందు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఇందులో డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్‌టౌన్, టూ టౌన్, ట్రాఫిక్ సీఐలు సునిల్ కుమార్, కరుణాకర్ రావు, ప్రణయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




పాఠశాలను పునఃప్రారంభిస్తున్న విద్యాశాఖ అధికారులు, చిత్రంలో గ్రామస్తులు, విద్యార్థులు

15 ఏళ్ల తర్వాత మోగిన బడి గంట

- కలెక్టర్ ఆదేశాలతో తెరుచుకున్న డబ్బకుచ్చి పాఠశాల

ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 15 ఏళ్ల తర్వాత ఆ పాఠశాలలో మళ్లీ బడి గంట మోగింది. కలెక్టర్ చొరవతో మండలంలోని డబ్బకుచ్చి ప్రభుత్వ పాఠశాల ఎట్టకేలకు పునఃప్రారంభమైంది. దశాబ్దంనరగా పాఠశాల మూతబడి ఉండడాన్ని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఈనెల 23న ప్రజావాణిలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు జిల్లా బాస్ రాజర్షి షా ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు మంగళవారం పాఠశాలకు చేరుకున్నారు. గ్రామస్తులతో కలిసి బడిని పునఃప్రారంభించారు. ఇందులో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. – భీంపూర్

ప్రైవేట్ కళాశాలలపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ఇటికల పురుషోత్తంను మంగళవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ తదితరులున్నారు.

క్లుప్తంగా

సోఫీనగర్ కాలనీలో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ కాలనీలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు కాలనీలో నివాసం ఉంటున్న బాబర్ సోమవారం రాత్రి కుటుంబంతో కలిసి ఇంట్లోనే నిద్రిస్తున్నారు. గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి రూ.12 వేల నగదు, ద్విచక్ర వాహనం అపహరించారు. ఉదయం లేచి చూసిన బాబర్ ఇంట్లో ఉన్న బ్యాగు, బైక్ కనిపించకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాలుడు అదృశ్యం


రమేశ్ (ఫైల్)

సోన్: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన బాలుడు అదృశ్యమైనట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన నక్క రమేశ్ (15) ఈనెల 17న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం బాలుని తల్లి నక్క ఎల్లవ్వ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

మందమర్రిరూరల్: మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ కోర్సులో60, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌లో 60, కంప్యూటర్స్‌లో 60, మెకానికల్‌లో 60, మైనింగ్‌లో 60 మొత్తం 300 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇందులో 150 సీట్లను సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలకు, 150 సీట్లు ఇతరులకు కేటాయించినట్లు తెలిపారు. సింగరేణి ఉద్యోగుల, మాజీ ఉద్యోగుల పిల్లలు జులై 3 లోగా, ఇతరులు ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9010222161, 8790112515 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అక్రమ నిర్మాణం సీజ్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ఎల్‌బీఎస్ నగర్‌లో వివాదాస్పదంగా మారిన ఓ ఇంటిని టాస్క్‌ఫోర్స్ కమిటీ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. సర్వే నంబర్ 45లోని ప్లాట్‌నంబర్ 37లో మడావి గోపాల్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టాడు. సదరు వ్యక్తి తన ప్లాట్‌ను ఆక్రమించి అక్రమంగా నిర్మాణం చేపట్టాడంటూ ఎల్చల సందీప్‌రెడ్డి బల్దియా అధికారులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన అధికారులు ఇంటి నిర్మాణాన్ని ఆపాలంటూ నోటీసులు జారీ చేశారు. అయినా వాటిని లెక్క చేయకుండా గోపాల్ ఇంటి నిర్మాణాన్ని దాదాపుగా పూర్తి చేశాడు. దీంతో సందీప్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా ఇంటిని సీజ్ చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్, పోలీస్, రెవెన్యూ అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందం ఆ ఇంటిని సీజ్ చేసింది. సీజ్ చేసిన వారిలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ యజువేందర్‌రెడ్డి, టీపీవో సుమలత, టీపీఎస్ నవీన్ కుమార్, ఎస్సై విష్ణు ప్రకాశ్, తదితరులు ఉన్నారు.

మెడికల్ బోర్డు పిలుపు ఎప్పుడో..?

- 3 నెలలుగా నిర్వహించని సమావేశం
- సింగరేణి వ్యాప్తంగా 700 మంది నిరీక్షణ
- ఆందోళనలో హయ్యర్ సెంటర్ రిఫరల్ కేసు బాధితులు



శ్రీరాంపూర్:సింగరేణి కార్పొరేట్ మెడికల్ బోర్డు సమావేశం నిలిచిపోయింది. మూడు నెలలుగా బోర్డు సమావేశం ఏర్పాటు చేయకపోవడంతో జబ్బుపడిన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలకోసారి మెడికల్ బోర్డు సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. కానీ 2025, మార్చి 21న నిర్వహించిన మెడికల్ బోర్డు మళ్లీ ఇప్పటి వరకు నిర్వహించలేదు. దీంతో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులు నిరీక్షిస్తున్నారు. కంపెనీ నిబంధనల ప్రకారం ఏదైనా అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులు ఇక తాము డ్యూటీలు చేయలేమని భావిస్తే మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకుంటారు. ఉద్యోగ విరమణ తేదీకి కనీసం రెండేళ్ల ముందు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కీళ్ల నొప్పులు, నడుం నొప్పులు, కిడ్నీ సమస్యలు, గుండె జబ్బులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల భారిన పడిన వారంతా కూడా బోర్డుకు దరఖాస్తు చేసుకుంటారు. దీంతో పాటు గనులు, బయట ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి ఏరియా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని కూడా ఏరియా వైద్యాధికారులు కార్పొరేట్ మెడికల్ బోర్డుకు రెఫర్ చేస్తారు.

హయ్యర్ సెంటర్ రిఫరల్ కేసులు..

హయ్యర్ సెంటర్ రిఫరల్ బాధిత కార్మికులను హైదరాబాద్‌లోని నిమ్స్, ఇతర ప్రముఖ ఆస్పత్రులకు కంపెనీ రెఫర్ చేస్తుంది. ఇలా రిఫరల్ అయిన కార్మికులు అక్కడ చేయించుకున్న వైద్య పరీక్షల రిపోర్టును కంపెనీకి సమర్పిస్తారు. వారిని మెడికల్ బోర్డుకు పిలిచి వైద్యపరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేస్తారు. అయితే ఈ ఏడాది మార్చిలో జరిగిన మెడికల్ బోర్డుకు ముందు మూడు నెలల నుంచి ఇలాంటి కేసులను బోర్డుకు పిలువలేదు. ఇలా ఆరు నెలలుగా హయ్యర్ సెంటర్ రిఫరల్ కేసులు పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో తాము వేతనాలు కోల్పోవాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు.

700 మంది నిరీక్షణ..

సింగరేణి వ్యాప్తంగా సుమారు 700 మంది కార్మికులు మెడికల్ బోర్డు పిలుపుకోసం ఎదురుచూస్తున్నారు. మెడికల్ బోర్డుకు వెళ్లిన కేసులను అక్కడి వైద్యబృందం, అధికారులు పరీక్షిస్తారు. వారికి ఉన్న జబ్బుల తీవ్రతను బట్టి అండర్ గ్రౌండ్‌లో పనిచేయలేని వారిని అన్‌ఫిట్ చేసి సర్ఫేస్‌లో డ్యూటీ ఇస్తారు. పూర్తిగా పని చేయలేరని భావించిన వారిని ఇన్వాలిడేషన్ చేస్తారు. దీని కింద కార్మికుని డిపెండెంట్లకు కారుణ్య ఉద్యోగం వస్తుంది.

సమావేశం నిర్వహించాలి

సింగరేణి యాజమాన్యం ఇకనైనా ఆలస్యం చేయకుండా వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించాలి. నెలకోసారి నిర్వహించాల్సిన బోర్డును ఇప్పటికీ మూడు నెలలుగా నిర్వహించకపోవడంతో వ్యాధుల భారిన పడిన కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

– కే.వీరభద్రయ్య, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా వెడ్మ బొజ్జు


నియామకపత్రం అందుకుంటున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆత్రం సుగుణ

ఉట్నూర్‌రూరల్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను నియామకమయ్యారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సీఎం చేతుల మీదుగా నియామకం పత్రం అందుకున్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా సుగుణ

టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ నియామకమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. పార్టీలో తనకు గౌరవమైన హోదాను కల్పించినందుకు జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

బ్యాంకులో తుపాకీ మిస్‌ఫైర్

- తప్పిన పెను ప్రమాదం
- ఆదిలాబాద్‌లో ఘటన


బుల్లెట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీ చౌక్ ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో తుపాకీ మిస్‌ఫైర్ అయ్యింది. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. పెను ప్రమాదం తప్పడంతో బ్యాంకుకు వచ్చిన వారు ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం ఉదయం 10.15 గంటలకు బ్యాంకు నుంచి డబ్బులు బయటకు తీసుకెళ్లే సమయంలో గార్డ్ రాములు తుపాకీలో బుల్లెట్లు లోడ్ చేశాడు. పొరపాటున ట్రిగ్గర్‌పై వేలు పడడంతో ఒక్కసారిగా తూటా బ్యాంక్ పైకప్పుకు తగిలింది. దీంతో అధికారులు, సిబ్బంది ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందోనని ఆందోళనకు గురయ్యారు. ఆ సమయంలో కొందరు ఖాతాదారులు మాత్రమే బ్యాంకులో ఉన్నారు. వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని సంఘటనపై ఆరా తీశారు.

బ్రాండెడ్ పేరిట రాయితీ బియ్యం విక్రయం

- ముగ్గురు వ్యాపారులపై కేసు
- పరారీలో ఒకరు


రాయితీ బియ్యం పరిశీలిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: బ్రాండెడ్ రైస్ పేరుతో ప్రభుత్వ రాయితీ బియ్యం విక్రయిస్తున్న ఘరానా ముఠాను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఎస్పీకి అందిన సమాచారం మేరకు జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్‌లో దుకాణాలను తనిఖీ చేయగా ఇద్దరు వ్యాపారుల వద్ద 80 క్వింటాళ్ల రాయితీ బియ్యం బ్రాండెడ్ బ్యాగుల్లో వేసి ప్రజలకు విక్రయిస్తున్నట్లు గుర్తించి ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. శివాజీ చౌక్‌లోని రజిత కిరాణంకు చెందిన గాగుల్వార్ రాజేశ్వర్, ఆంధ్ర కిరాణంకు చెందిన షేక్ అయ్యుబ్‌లను అరెస్టు చేశారు. చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ అస్లమ్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. మార్కెట్లో మంచి బ్రాండ్‌గా ఉన్న జై శ్రీరామ్, గోల్డెన్, సైకిల్‌బ్రాండ్, సూర్యతేజ, మధురం, దీపం, గీతాంజలి, వైట్‌ప్లాటినం, శ్రీదత్త అనే పేర్లతో ఉన్న ఖాళీ సంచుల్లో పీడీఎస్ రైస్ నింపి మిషన్‌తో సీల్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూగజీవాలు మృతి

భీమారం(చెన్నూర్): మండలంలోని దాంపూర్ సమీపంలో సోమవారం రాత్రి విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు మేకల కొమురయ్య, నాంపల్లి సుగుణకు చెందిన రెండు గేదెలు అడవికి మేతకోసం వెళ్లాయి. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో మంగళవారం ఉదయం వెతుకుతుండగా గ్రామ పొలిమేరలో మృతి చెంది కనిపించాయి. పంటపొలాలకు విద్యుత్ సరఫరా చేసే తీగ తెగి కిందపడటంతో అదేమార్గం గుండా వచ్చిన గేదెలు తీగను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. గేదెల విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. సంఘటన స్థలాన్ని పశువైద్యాధికారి రాకేశ్‌శర్మ సందర్శించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్‌హెచ్‌ఎం విభాగం నందు యూపీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న రెండు మెడికల్ ఆఫీసర్ పోస్టులు, ఆయుష్మాన్ ఆరోగ్య మిషన్‌లో ఎంఎల్‌హెచ్‌పీలో రెండు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఎంబీబీఎస్, ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు ఎంబీబీఎస్/బీఏఎంఎస్ అర్హత ఉండాలన్నారు. అభ్యర్థులు ఈ నెల 26న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

బాలికను వేధించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బాలికను లైంగికంగా వేధించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు షీటీమ్ ఇన్‌చార్జి ఏఎస్సై బి.సుశీల తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడకు చెందిన జాదవ్ కృష్ణ ఓ బాలికకు ప్రతీరోజు రూ.10 ఇచ్చి చాక్లెట్లు, బిస్కెట్లు కొనిస్తూ లైంగికంగా వేధిస్తున్నాడు. షీటీమ్ బృందం జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి వివరిస్తున్న సందర్భంలో తనకు జరిగిన అన్యాయాన్ని సదరు బాలిక షీటీమ్ బృందానికి తెలియజేసింది. కుటుంబ సభ్యులకు వివరాలను వెల్లడించడంతో వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై..

తానూరు: ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలకు ఇచ్చిన భూమి తనదేనంటూ లబ్ధిదారులను బెదిరించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. బామ్నితండాకు చెందిన పోశెట్టి గతంలో ప్రభుత్వానికి 3.33 ఎకరాల భూమిని విక్రయించాడు. అట్టి భూమిని ప్రభుత్వం లబ్ధిదారులకు పంచింది. అందులో ఇంటి నిర్మాణానికి స్థలాన్ని చదును చేసుకుంటుండగా పోశెట్టి కుమారుడు కిష్టయ్య ఆ భూమి తమదేనంటూ లబ్ధిదారులను బెదిరించాడు. బాధితులు తహసీల్దార్ లింగంమూర్తిని ఆశ్రయించడంతో రికార్డులు పరిశీలించి కిష్టయ్యపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేధించిన కేసులో మూడేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: బాలికను వేధించిన కేసులో ఒకరికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ.4వేల జరిమానా విధిస్తూ జిల్లా అదనపు జడ్జి డాక్టర్ శివరాంప్రసాద్ మంగళవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. బేల గ్రామానికి చెందిన బాలికకు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన సాగర్ శరత్ మొబైల్ ఫోన్‌లో వాట్సాప్ కాల్ చేసాడు. ఆ స్క్రీన్‌షార్ట్‌ను తిరిగి బాలికకు వాట్సాప్ ద్వారా పంపించి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. బాలిక విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో 2023 ఏప్రిల్ 15న బేల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై బి.కృష్ణ కుమార్ కేసు నమోదు చేయగా కోర్టుడ్యూటీ అధికారి శ్రీనివాస్ పది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ ప్రవీణ్ కుమార్ నేరం రుజువు చేశారు.

ఏటీఎంలో చోరీ కేసులో ఇద్దరు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ భాస్కర్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో సంచలనం సృష్టించిన ఏటీఎంలో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడిన ఐదుగురు నిందితుల్లో ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీసీపీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ రవికుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. హర్యానా రాష్ట్రానికి చెందిన జేసీబీ ఆపరేటర్లు మహ్మద్ ముస్తాఫా, షాహీద్, వారి సహచరులైన ఆలీంఖాన్, సాజిద్, అప్తాబ్‌తో కలిసి ఏటీఎంలోకి వెళ్లి మిషన్ క్యాషెట్‌ను గ్యాస్‌కట్టర్‌తో కట్ చేశారు. అంతలోనే పోలీస్ సైరన్ వినిపించడంతో క్యాషెట్‌ను (రూ.30వేల)ను పట్టుకెళ్లారు. ఏటీఎం నిర్వాహకులు సీఎంఎస్ కంపెనీకి చెందిన అసిస్టెంట్ మేనేజర్ శివకుమార్ ఫిర్యాదుతో బెల్లంపల్లి టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం బెల్లంపల్లి కెమికల్ ప్రాంతంలో మహ్మద్ ముస్తాఫా, షాహిద్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, గ్యాస్ కట్టర్, గ్యాస్ సిలిండర్‌తో పాటు ఏటీఎంలోని క్యాషెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆలీంఖాన్, సాజిద్, అప్తాబ్ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. నిందితులు మహారాష్ట్రలోని అహేరిలో పల్సర్ బైక్, మంచిర్యాలలో షైన్ బైక్‌ను దొంగలించారు. కాగజ్‌నగర్‌లో గ్యాస్ కట్టర్, కొటాలలో గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేశారు. కేసును ఛేదించిన బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై కే.మహేందర్, నెన్నెల ఎస్సై ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్ సాయికృష్ణ, హోంగార్డు సంపత్‌ను డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక రైలు

నిర్మల్‌చైన్‌గేట్: తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల కోసం జులై 5 నుంచి 13 వరకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైలు ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్ జీపీ కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీంశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోవ్, నాగపూర్‌కు జులై 5న యాత్ర ప్రారంభమై 13 వరకు కొనసాగుతుందన్నారు. ఇందుకోసం ఒక్కొకరికి సాధారణ టికెట్టు ధర రూ.14,700, థర్డ్ ఏసీ ధర రూ.22,900, సెకండ్ ఏసీ ధర రూ.29,900 ఉంటుందన్నారు. యాత్ర సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, నాందేడ్, ముద్ఖడ్, పూర్ణ మీదుగా వెళ్తుందన్నారు. ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్‌తో పాటు ఆయా రైల్వే స్టేషన్‌ల నుంచి దేవాలయాల వరకు ప్రయాణం పూర్తిగా ఉచితమన్నారు. ప్రతీ 70 మందికి ఇద్దరు కోఆర్డినేటర్లు అందుబాటులో ఉండి అన్ని సౌకర్యాలు సమకూరుస్తారన్నారు. ఆసక్తి కలవారు 9701360701, 9281495843, నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వేధింపులతో యువకుడు ఆత్మహత్య

- వ్యాపారి ఇంటి ఎదుట బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన


రాజశేఖర్ (ఫైల్)


ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు


పెంచికల్‌పేట్: వ్యాపారి వేధింపులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అగర్‌గూడలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన తుమ్మిడే రాజశేఖర్ (22) కొంతకాలంగా ఎల్కపల్లి గ్రామానికి చెందిన వ్యాపారి కృష్ణ ఎరువుల దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. తన సోదరి డెలివరీకి ఉండగా నాలుగురోజుల పాటు దుకాణానికి వెళ్లలేదు. సోమవారం విధులకు హాజరుకావడంతో కోపోద్రిక్తుడైన వ్యాపారి తీవ్ర పదజాలంతో దూషించడంతో పాటు డబ్బులు దొంగిలించాడని హేళనగా మాట్లాడాడు. బాకీ ఉన్న రూ.10వేలు ఇవ్వాలనగా ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. అంతేకాకుండా కేసు పెడతానని ఫోన్‌లో కుటుంబ సభ్యులను బెదిరించడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. అగర్‌గూడ సమీపంలోని పంట చేనులో గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా కాగజ్‌నగర్, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి లక్ష్మి కన్నీరుమున్నీరవుతోంది. ఘటనకు కారకుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వ్యాపారి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై కొమురయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు.

పైచదువులు ఇష్టంలేక విద్యార్థి ఆత్మహత్య


తరుణ్‌గౌడ్(ఫైల్)

దండేపల్లి(మంచిర్యాల): పై చదువులు ఇష్టంలేక ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దండేపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పొన్నం చంద్రగౌడ్, మాధవి దంపతుల కుమారుడు పొన్నం తరుణ్‌గౌడ్ (18) ఇంటర్ పూర్తి చేశాడు. బీటెక్ చదవాలని తండ్రి సూచించడంతో నాకు పైచదువులు ఇష్టం లేదని, ఏదైనా వ్యాపారం చేసుకుంటానని చెప్పాడు. అయితే బీటెక్ అయ్యాక వ్యాపారం చేసుకొమ్మని తండ్రి నచ్చజెప్పాడు. ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లి కొన్ని బీటెక్ కాలేజీలు కూడా చూసివచ్చారు. అప్పటి నుంచి దిగాలుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి గదిలో ఉన్న తరుణ్‌ను భోజనానికి పిలిస్తే రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లిచూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. మృతుని తండ్రి చంద్రగౌడ్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్ ఇష్టంలేక ఒకరు..


గంగాధర్ (ఫైల్)

లోకేశ్వరం(ముథోల్): మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బిలోలిలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఓల్‌కర్ బీరన్న-రాంబాయి దంపతుల కుమారుడు గంగాధర్ (17)నిర్మల్ పట్టణంలోని బీసీ వెల్ఫేర్ పాఠశాలలో ఇటీవల పదోతరగతి పూర్తి చేశాడు. ఇంటర్ చదివేందుకు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో అప్లై చేసుకున్నాడు. అయితే హోటల్ మేనేజ్‌మెంట్ చేస్తానని, ఇంటర్ చదవనని చెప్పడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం తమ పంటచేనులో మద్యం సీసాలో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..


రవీంద్రనాథ్ (ఫైల్)

సిరికొండ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఏఎస్సై శ్రీసాయి, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన దోండే రవీంద్రనాథ్ (48) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలో పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..


సురేశ్ (ఫైల్)

కడెం: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెద్దూర్‌తండాకు చెందిన హాపవత్ సురేశ్ (22) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో పెద్దూర్ సమీపంలోని ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుని తల్లి అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

తానూరు: ఆటో డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. హిప్నెల్లితండాకు చెందిన రాథోడ్ అశ్విన్ తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తుండగా అందులో ప్రయాణిస్తున్న రాథోడ్ గురుజీ, సునీల్ గొడవపడ్డారు. వారిని ఆటోలోంచి దిగిపొమ్మనడంతో ఇనుపరాడ్డుతో దాడికి పాల్పడ్డారు. గాయాలు కావడంతో అశ్విన్‌ను స్థానిక ఆస్పత్రికి తరలించారు. బాధితుని తల్లి అంజనాబాయి ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొమ్మలు కాదు.. చెట్లే నరికేశారు..!

- విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని..
- ఫిర్యాదుపై పట్టించుకోని అధికారులు
- ప్రజావాణిలో మూడుసార్లు ఫిర్యాదు


నరికిన చింతచెట్ల వద్ద బాధితుడు మహేశ్

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు విద్యుత్ శాఖ సిబ్బంది కొట్టేస్తుంటారు. జిల్లాలోని నెన్నెల మండల విద్యుత్ శాఖ అధికారులు ఏకంగా 80 చింతచెట్లు కొట్టేయించారు. దిగుబడి వచ్చే చెట్లను కొట్టేయడంపై బాధితుడు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. నెన్నెల మండలం వెల్లంపల్లికి చెందిన ముడపల్లి మహేశ్‌కు భీమారం మండలం కాజిపల్లి శివారు సర్వేనంబరు 94/1లో 4.12 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. చుట్టూ 2015లో 90 చింతచెట్ల మొక్కలు నాటి పెంచుతున్నాడు. రెండేళ్లుగా చింతపండు దిగుబడి వస్తోంది. గత ఏడాది రూ.70వేలు ఆదాయం వచ్చింది. భవిష్యత్‌లో మంచి లాభాలు వస్తాయని ఆశిస్తే విద్యుత్‌శాఖ అధికారులు అడియాసలు చేశారు. నెన్నెల మండల విద్యుత్ శాఖ అధికారులు 2025 మే 5న వెంకటపూర్, కొత్తూర్‌కు కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటుకు అడ్డుగా ఉన్నాయని 80 చెట్లు నరికేశారు. కొమ్మలు అడ్డుగా ఉంటే నరికేస్తారు. కానీ ఇక్కడ చెట్లే నరికేయడం గమనార్హం. అనుమతి లేకుండా చెట్లు నరికేశారని విద్యుత్‌శాఖ, తహసీల్దార్, అటవీశాఖ, పోలీసుస్టేషన్, ఉద్యానవన అధికారులకు, కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణిలో మూడు సార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని బాధితుడు మహేశ్ వాపోతున్నాడు. అటవీశాఖ అధికారులు పరిశీలించి చెట్ల విలువను టింబర్ రేట్ ప్రకారం రూ.17వేలుగా నిర్ణయించారని, అక్రమంగా నరికినందుకు తమకు ఎలాంటి సంబంధం లేదని తేల్చేశారని తెలిపాడు. విద్యుత్ శాఖ అధికారులు తప్పిదాన్ని కప్పిపుచ్చుకోవడానికి స్థానిక ప్రజాప్రతినిధులతో ఒత్తిడి తీసుకొస్తున్నారని పేర్కొన్నాడు. నరికిన చెట్లు పొలంలోనే ఉండడంతో వరిసాగు చేసుకోవడం కష్టంగా మారిందని తెలిపాడు. ఏడాదికి రూ.లక్షలు ఆదాయం, వందేళ్ల దిగుబడి వచ్చే చెట్లను అన్యాయంగా నరికేశారని, న్యాయస్థానాన్ని ఆశ్రయించక తప్పేలా లేదని పేర్కొన్నాడు.

కొమ్మలు నరికేశారు..

విద్యుత్ లైన్‌కు అడ్డుగా వస్తున్నాయి.. కొమ్మలు నరుకాలని ఏఈ సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించడంతో కొమ్మలు మాత్రమే నరికేశారు. చెట్లు నరకాలని చెప్పలేదు. చెట్లు ఎవరు నరికి వేశారో తెలియదు. బాధితుడు నా వద్దకు వచ్చి ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ కొనసాగుతోంది.

– గంగాధర్, జిల్లా విద్యుత్ శాఖ అధికారి

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి


ఏసీబీకి పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ

దస్తురాబాద్: మండలంలోని గోడిసీర్యాల గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ ఆదిలాబాద్ డీఎస్పీ మధు తెలిపిన వివరాల ప్రకారం.. గోడిసీర్యాల గ్రామానికి చెందిన గోసుకుల రాజేశ్ తన గ్రామంలో నూతన వాటర్ ప్లాంట్‌కు నిర్వహణ అనుమతుల కోసం శివకృష్ణను సంప్రదించాడు. రూ.15 వేలు డిమాండ్ చేయగా.. చర్చల అనంతరం రూ.12 వేలకు ఒప్పందం కుదిరింది. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో అనుమతి పత్రాలను శివకృష్ణ రాజేశ్‌కు ఇచ్చాడు. అనంతరం గ్రామ సమీపంలోని ఓ నర్సరీలో రూ.12 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెండ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదుతోపాటు శివకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని ఆదిలాబాద్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ మధు తెలిపారు.